ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
15-10-2024
మంగళవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 40 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




ఏపీలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ పూర్తైంది. సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన లక్కీ డ్రా మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. అయితే లాటరీలో పలుచోట్ల గందరగోళం నెలకొంది. మరోచోట ఒకే వ్యక్తికి 5 షాపు దక్కాయి.

## ఏపీ మద్యం షాపుల లక్కీ లాటరీ

**బీజేపీ నేతకు 5 దుకాణాలు**

**6-9 వ్యత్యాసంతో షాపు గల్లంతు**





ఏపీలో మద్యం షాపుల లాటరీ ప్రక్రియ పూర్తైంది. రెండేళ్ల పాటు అమల్లో ఉండే కొత్త మద్యం పాలసీకి అనుగుణంగా 26 జిల్లాల్లో మొత్తం 3,396 మద్యం దుకాణాలకు రాష్ట్ర వ్యాప్తంగా 89,882 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారులకు లాటరీ విధానంలో షాపులను కేటాయిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభమైంది. కాసులు కురిపించే వ్యాపారం కావడంతో పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. లాటరీ విధానంలో పూర్తిగా పారదర్శకంగా షాపులను కేటాయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**బీజేపీ నేతకు 5 షాపులు**

సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు లాటరీ ప్రక్రియ కొనసాగింది. షాపుల కేటాయింపు పూర్తిగా అదృష్టంపై ఆధారపడి ఉంటుంది. ఇవాళ లక్ ఉన్నవారికి లాటరీల్లో షాపులు వచ్చాయి. షాపు వచ్చిన వారు నగదు సమీకరించే పనిలో ఉన్నారు. మద్యం షాపుల లాటరీలో కొందరికి అదృష్టం బాగా కలిసొచ్చింది. బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులుకు ఏకంగా ఐదు మద్యం దుకాణాలు దక్కాయి. పుట్టపర్తిలో కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో చేపట్టిన లాటరీ ప్రక్రియలో... ధర్మవరం మున్సిపాలిటీలో దుకాణం 1, 4, ధర్మవరం రూరల్‌లో 12, ముదిగుబ్బ మండలంలో 19, బత్తలపల్లి మండలంలో 14వ నంబర్ మద్యం షాపులు ఆయనకు దక్కాయి. ఒక్కరికే ఐదు

...మిగతాది 2 లో



తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు దుద్దిళ్ల తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని Foxconn కంపెనీని సందర్శించారు.

## ముందుకొచ్చే కంపెనీలకు భరోసా..

✍ జయభేరి, హైదరాబాద్ :

ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమై కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని మరోసారి భరోసా ఇచ్చారు. కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు Foxconn ముందుకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ఐటీ విభాగం ఉన్నతాధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## నేను ఏ హీరోతో పోటీ పడను

- **అభిమానుల కోరిక నాకు తెలుసు పవన్ కల్యాణ్**

రాష్ట్ర వ్యాప్తంగా సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, కంపౌండ్ వాల్స్, పాఠశాలల్లో రూఫ్ టాప్స్ ఇలా 30 వేల అభివృద్ధి పనులు చేపట్టేందుకు పల్లె పండుగ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సంవత్సరానికి రూ.10 వేల కోట్లు ఉపాధి హామీ నిధులు వస్తాయని పవన్ తెలిపారు. "నేను అందరూ హీరోలు బాగుండాలని కోరుకుంటాను. నేను ఎవ్వరితో పోటీ పడను, ప్రతీ ఒక్కరికీ వారిదంటూ ఒక శైలి ఉంది" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. తనకు చిరంజీవి, బాలకృష్ణ, ప్రభాస్, మహేశ్ బాబు, రామ్ చరణ్, తారక్, నాని, అల్లు అర్జున్... ఇలా ప్రతీ హీరో ఇష్టమే అన్నారు. వారి సినిమాలు విజయం సాధించాలని, అభిమానులు ఆనందపడాలని కోరుకుంటానన్నారు. సినిమాలు చూడాలంటే ముందు జనం దగ్గర సంపాదన ఉండాలి అని, అది సృష్టించడం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. కృష్ణా జిల్లా కంకిపాడులో నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల ప్రారంభోత్సవంలో పవన్ పాల్గొన్నారు.

...మిగతాది 2 లో



## క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

- **డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని పిటిషన్లు దాఖలు**

✍ జయభేరి, హైదరాబాద్ :

ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఇటీవల కేంద్రం ఆదేశించింది. ఈ నేపథ్యంలో నలుగురు ఐఏఎస్ అధికారులు క్యాట్ ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఇటీవలి ఏపీ కేడర్ అధికారులను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వానికి

...మిగతాది 2 లో



## సురేఖపై క్రిమినల్ చర్యలకు కేటీఆర్ డిమాండ్

✍ జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14:

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మంత్రి కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. ఆయన తరఫు న్యాయవాది ఉమమహేశ్వరరావు నాంపల్లి ప్రత్యేక కోర్టులో దీనికి సంబంధించి పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్‌ను సాక్షులుగా పేర్కొన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యానించారని క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఇటీవలే హీరో నాగార్జున మంత్రి సురేఖపై పరువు నష్టం దావా వేశారు. ఆమె తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార వ్యాఖ్యలు చేశారని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ సహా సమంత, నాగచైతన్య విడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆర్ అంటూ ఇటీవల కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేటీఆర్.. తనపై అసత్య ఆరోపణలు చేశారని.. సంబంధం లేని విషయాల్లో అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. తన గౌరవానికి, ఇమేజ్‌కు భంగం కలిగించాలనే లక్ష్యంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసుల్లో పేర్కొన్నారు. కేవలం రాజకీయ కక్షతో, తన ప్రయోజనాల కోసమే తన పేరును వాడుకుంటున్నారని.. మహిళ అయి ఉండి సాటి మహిళ పేరును, సినిమా నటుల పేరును వాడుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడడం దురదృష్టకరమని అన్నారు. 'ఒక మంత్రిగా కొండా సురేఖ మంత్రి హోదాని దుర్వినియోగం చేశారు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఆమె చేసిన అసత్య వ్యాఖ్యలు సోషల్

...మిగతాది 2 లో




## ఐసీఐసీఐ బ్యాంకులో 100 కోట్లపైనే గోల్ మాల్

✍ జయభేరి, గుంటూరు:

నర్సరావుపేట, చిలుకలూరిపేట బ్రాంచుల్లో జరిగిన ఖాతాదారుల నగదు, బంగారం గోల్ మాల్ చిన్నది కాదని కనీసం వంద కోట్ల వరకూ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారంలో అసలు నిందితుడిగా అప్రైజర్‌తో పాటు మరో ఉద్యోగి నరేష్‌ను గుర్తించారు. అయితే ఇలా గోల్ మాల్ చేయడం ఒకరిద్దరితో అయ్యే పని కాదన్న ఉద్దేశంతో సీఐడీ అధికారులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నరేష్ పోలీసులకు లొంగిపోకుండా పరారీలో ఉన్నారు. ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ వీడియోను రిలీజ్ చేశారు.



## రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ జీవో

✍ జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 14:

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన ఎత్తివేశారు. ఈ మేరకు కేంద్రం గెజిట్ విడుదల చేసింది. దీనిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతకం చేశారు. కేంద్రపాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్ కొత్త ప్రభుత్వ పాలన దిశగా అడుగులు వేస్తుంది. జమ్మూకశ్మీర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన 2019 ఏడాది అక్టోబర్ 31న విధించగా.. దాదాపు 5 ఏళ్ల తర్వాత ఎత్తివేశారు.జమ్మూ

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ... కేటీఆర్ డిమాండ్

మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. మంత్రిగా తన సహచర అసెంబ్లీ సభ్యుడనే సోయి లేకుండా మాట్లాడడం ఆశ్చర్యానికి గురి చేసింది. అబద్ధాలు, అసత్యాలు మాట్లాడినందుకు ఆమె బహిరంగ క్షమాపణ చెప్పాలి.' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.మరోవైపు, ఈ వ్యవహారంలో సినీ నటుడు నాగార్జున సైతం నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. తన కుటుంబంతో పాటు, కుమారుడు నాగచైతన్య సమంత విడాకుల అంశంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం మంత్రికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 23వ తేదీకి వాయిదా వేసింది. అంతకు ముందు విచారణ సందర్భంగా నాగార్జున స్టేట్‌మెంట్ రికార్డు చేయాలని కోర్టు ఆదేశించడంతో..నాగార్జున, అమల, నాగచైతన్య నాంపల్లి కోర్టుకు మంగళవారం హాజరయ్యారు.అటు, కొండా సురేఖ వ్యాఖ్యలను పలువురు సినీ ప్రముఖులు సైతం ఖండించారు. ఆధారాల్లేని వ్యాఖ్యలు చేస్తే మౌనంగా ఊరుకోమని.. ఆమె క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. తన వ్యాఖ్యల ఉద్దేశం మహిళల పట్ల ఓ నాయకుడి చిన్న చూపు ధోరణిని ప్రశ్నించడమే కానీ.. సమంత మనోభావాలను దెబ్బతీయడం కాదన్నారు. స్వయంశక్తితో ఆమె ఎదిగిన తీరు తనకు కేవలం అభిమానం మాత్రమే కాదు.. ఆదర్శం అని కూడా పేర్కొన్నారు

## నేను ఏ హీరోతో పోటీ పడను

పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. 'అభిమానుల కోరిక కూడా నాకు తెలుసు, నాకు ప్రజల సమస్యల పరిష్కారం ఎక్కువ ఆనందం ఇస్తుంది. మీ సమస్యల పరిష్కారంతో పాటుగా మీ ఆనందం కూడా ముఖ్యమే, నేను మరింత బలంగా పనిచేయాలన్నా, ఎవరికైనా సహాయం చేయాలంటే నాకున్న ఆర్థిక మార్గం సినిమాలు ఒక్కటే. తీరిక సమయంలో చూసుకుని మిమ్మల్ని ఆనందింప చేస్తాను' అని పవన్ కల్యాణ్ అన్నారు. ఇవాళ పంచాయతీరాజ్ శాఖ రూ.4,500 కోట్ల వ్యయంతో పనులు చేపడుతుందంటే... అధికారులతో పాటుగా కూటమి శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల సహకారం చాలా ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. వచ్చే 5 ఏళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ఆకాంక్ష అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అపార అనుభవం రాష్ట్రాభివృద్ధికి కీలకం అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్నారు. ప్రతీ పంచాయతీలో ఏం పనులు జరుగుతున్నాయనేది ప్రజలకు తెలియాలని, ప్రతీ పంచాయతీ కార్యాలయంలో సిటిజన్ నాలెడ్జ్ బోర్డ్ ఏర్పాటు చేసి వివరాలు తెలియపరుస్తున్నామన్నారు. సంవత్సరానికి రూ.10 వేల కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రానికి నిధులు వస్తాయని పవన్ కల్యాణ్ తెలిపారు. దీని ద్వారా నైపుణ్యం లేని వ్యక్తులకు ఉపాధి అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్న వారికి 15 రోజుల్లో పనికల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. గుడివాడ నియోజకవర్గంలో 43 గ్రామాల్లో నీటి సమస్యను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు బూతులు, శాపనార్థాలు తప్ప ఈ నీటి సమస్య గురించి పట్టించుకోలేదన్నారు. వెంటనే గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రతీ గ్రామానికి టీమ్స్ పంపించి నీటి నాణ్యత పరిశీలించి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తుంచారు. గ్రామీణ కుటుంబాలకు కనీసం 100 రోజుల పని కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు, కంపౌండ్ వాల్స్, పాఠశాలల్లో రూఫ్ టాప్స్, గోకులం నిర్మాణాలు, నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో సమస్యను తీర్చడం, పారిశుద్ధ్య పనులు, ఇతర 30 వేల అభివృద్ధి పనులు చేపట్టేందుకు పల్లె పండుగ వారోత్సవాల్లో శంకుస్థాపన చేసి సంక్రాంతి లోపు పూర్తి చేసేలా పనిచేయనున్నామని ప్రకటించారు.

## ఏపీ మద్యం షాపుల లక్కీ లాటరీ

దుకాణాలు దక్కడం గమనార్హం.
శ్రీకాకుళం జిల్లాలో అధికారుల చిన్న పొరపాటు... గందరగోళానికి దారితీసింది. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ చేపట్టారు. ఆమదాలవలస సర్కిల్ పరిధిలోని 42వ మద్యం షాపు లక్కీ డ్రాలో 9వ నంబర్ వచ్చింది. అయితే ముందుగా దానిని 6వ నంబర్ అని మైక్‌లో చెప్పారు. దీంతో 6 నెంబర్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి సంబరాలు చేసుకున్నాడు. ఇంతలో అది 6 కారు పొరపాటున చెప్పాం, 9వ నెంబర్ అని అధికారులు ప్రకటించారు. ఈ విషయంపై అధికారులు వెంటనే క్రాస్ చెక్ చేశారు. దీంతో అది 9వ నంబర్ అని తేలింది. ముందుగా 6వ నంబర్ ప్రకటించటంతో ఆనందపడిన దరఖాస్తుదారుడు.. లక్కీ డ్రా విజేత 9వ నెంబరు అని చెప్పడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు. అధికారులు నంబర్ కావాలనే మార్చేశారని ఆరోపించారు. అధికారులతో వాదనకు దిగడంతో చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. మద్యం దుకాణం కోసం కోటి ఆశలతో ఎదురుచూస్తుంటే... తమ ఆశలపై అధికారులు నీళ్లు చల్లారని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక వ్యవహారం కావడంతో అధికారులు మరింత కట్టుదిట్టంగా వ్యవహించాలని దరఖాస్తుదారులు సూచించారు. కాసేపు కరెంట్ పోవడంతో గందరగోళం నెలకొంది. కరెంట్ వచ్చాక... ఆందోళన చేస్తున్న వారిని పిలిచి అధికారులు సర్దిచెప్పారు. 6, 9 నెంబర్ మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. దీంతో లాటరీ ప్రక్రియ ముందుకు సాగింది.

## 100 కోట్లపైనే గోల్ మాల్

అందులో తనతో పాటు చాలా మందికి ఈ విషయాలు తెలుసని కానీ తనను మాత్రమే బలి పశువును చేస్తున్నట్లుగా ఆయన చెప్పుకొచ్చారు. మొదట చిలుకలూరిపేట బ్రాంచ్‌లో పని చేసినప్పుడు బ్రాంచ్ వ్యాపారం పెంచేందుకని చెప్పి ఖాతాదారుల ఇళ్లకు వెళ్లి మరీ ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా బంగారం, నగదు డిపాజిట్ చేసుకునేందుకు ప్రయత్నించారు. బ్యాంకు సాధారణంగా ఆఫర్ చేసే వడ్డీ కన్నా ఎక్కువ ఆఫర్ చేశారు. అయితే బ్యాంకే ఆఫర్ ఇస్తున్నట్లుగా నమ్మించారు. వారి వద్ద నుంచి బంగారం, నగదు తీసుకుని బ్యాంకు ఇచ్చినట్లుగానే ఫిక్సుడ్ డిపాజిట్ పత్రాలు ఇచ్చారు. వడ్డీని ఠంచన్‌గా జమ చేయడం ప్రారంభించారు. అయితే ఖాతాదారులు వడ్డీ ఎక్కడి నుంచి వస్తుందో చూసుకోలేదు. అది బయట ఖాతాల నుంచి ఎందుకు జమ అవుతుందో అంచనా వేయలేకపోయారు. నర్సరావుపేటకు బదిలీ అయిన తర్వాత అక్కడ కూడా నరేష్ అదే పని చేశాడు. వారు డబ్బులు బ్యాంకులో జమ చేసినట్లుగా నమ్మించి సొంతానికి వాడుకుని వారికి ప్రైవేటు ఖాతాల నుంచి వడ్డీ జమ చేస్తూ వస్తున్నారు. గత రెండు నెలల నుంచి వడ్డీ జమ కాకపోతూండటంతో వారంతా బ్రాంచులకు వెళ్లి ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. బ్యాంకు పై నమ్మకం పోకుండా ఉండాలంటే.. తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉండటంతో సీఐడీని ప్రభుత్వం రంగంలోకి దించింది. సీఐడీ అధికారులు పూర్తి వివరాలు సేకరించారు. అప్రైజర్ ఆత్మహత్యాయత్నం చేసి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. నరేష్ పరారీలో ఉన్నాడు. నరేష్ దొరికితే చాలా విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే పోలీసులు చిలుకలూరిపేట, నర్సరావుపేటతో పాటు నిందితుడు ప్రస్తుతం పని చేస్తున్న విజయవాడ భారతి నగర్ ఐసీఐసీఐ బ్యాంకులోనూ దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలుసుకుంటున్నారు. ఖాతాదారుల నగదు, బంగారం నష్టపోకుండా తిరిగి వచ్చేలా చేసేందుకు సీఐడీ అధికారులు ప్రస్తుతం చర్యలు తీసుకుంటున్నారు. నరేష్ దొరికితే చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

## రాష్ట్రపతి పాలన ఎత్తివేస్తూ జీవో

కాశ్మీర్ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా.. ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలో కేంద్ర పాలిత ప్రాంతంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం రాష్ట్రపతి పాలన రద్దు చేశారు. ఇందులో భాగంగానే కేంద్రం హోం మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పలు కీలక అంశాలను వెల్లడించారు.2018లో జమ్మూకాశ్మీర్‌లో పీడీపీ, బీజేపీ మధ్య ఏర్పడిన భేదాభిప్రాయాలతో కూటమి ప్రభుత్వం చీలింది. దీంతో అసెంబ్లీని రద్దు చేసి 6 నెలలపాటు జమ్మూకాశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. ఆ తర్వాత 2019లో కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 31న రాష్ట్రపతి పాలనను పొడగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను రద్దు చేయడంతో పాటు జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.ఇదిలా ఉండగా, ఒమర్ అబ్దుల్లా జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంగా ఉన్న సమయంలో 2009 నుంచి 2014 సమయంలో ఎన్సీ, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వానికి సీఎంగా పని చేశారు. పదేళ్ల తర్వాత జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి మళ్లీ విజయం సాధించింది. ఈ మేరకు ఎల్‌జీకి ఎన్సీ ఉపాధ్యక్షుడు ఓ లేఖ సమర్పించారు. దీంతో కేంద్రం రాష్ట్రపతి పాలన ఎత్తివేసింది.

# మూసీ పోరాటంపై డైలమాలో బీఆర్ఎస్?

తెల్లారితే ఆందోళన చేస్తున్నామ్. వాళ్ల గొంతై వినిపిస్తున్నామ్. ఆ టాపిక్‌ను ఎవరూ చేయలేనంత హైలెట్ చేస్తున్నాం. ఇంతకీ అక్కడ బాధితులు ఎవరు..? బడాబాబులు ఎవరు..? మనం చేస్తున్న ఆందోళన పేదల కోసమేనా..? మూసీ అంశంలో మనం చేస్తున్న పోరాటం కరెక్టేనా..? లేదంటే ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఏదో ఓ ఆందోళన చేయాలి కాబట్టి రోడ్డెక్కుతున్నామా..? మూసీ ప్రక్షాళనపై చేస్తున్న పోరాటంతో మైలేజ్ వస్తుందా.. లేక మూసీ మురికి అంటుకుంటుందా.. బీఆర్ఎస్ పార్టీని ఇవే ప్రశ్నలు వెంటాడుతున్నాయట.



**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14:**

అసలు ఆందోళనలు అవసరమా అన్న డైలమాలో పడిందట కారు పార్టీ. మూసీ కంపు తీస్తామని సర్కార్..ముంపు బాధితుల పరిస్థితి ఏంటని బీఆర్ఎస్..పెద్దఎత్తున డైలాగ్ వార్ నడుస్తోంది. మూసీ ప్రక్షాళన పేరుతో ఆక్రమణలను తొలగిస్తుండటం దుమారం లేపుతోంది.
ఈ అంశంపై బీఆర్ఎస్ మూసీ నిర్వాసితుల పక్షాన నిలుస్తుంది. తెలంగాణ భవన్‌లో నిర్వాసితులతో సమావేశాలు నిర్వహిస్తూనే.. మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వారికి అండగా నిలుస్తున్నారు. ఇప్పటికిప్పుడు లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెచ్చి మూసీ ప్రక్షాళన చేస్తారని.. ప్రభుత్వాన్ని కార్నర్ చేస్తున్నారు. అంతేకాదు మూసీ నిర్వాసితులను ఉన్నఫలంగా పంపిచేస్తే వాళ్లు ఎక్కడికి వెళ్తారని, వారికి తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ భరోసా ఇస్తోంది.నిర్వాసితుల ఇళ్లపై బుల్డోజర్ వాలితే ఊరుకోమని.. ఏ రాత్రి ఫోన్ చేసినా వస్తామని

> **మూసీ నిర్వాసితులను ఉన్నఫలంగా పంపిచేస్తే వాళ్లు ఎక్కడికి వెళ్తారని, వారికి తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ భరోసా ఇస్తోంది. నిర్వాసితుల ఇళ్లపై బుల్డోజర్ వాలితే ఊరుకోమని.. ఏ రాత్రి ఫోన్ చేసినా వస్తామని చెబుతూ భరోసా ఇస్తున్నారు.**

చెబుతూ భరోసా ఇస్తున్నారు. అయితే మూసీ ప్రక్షాళనపై పోరాటం కరక్టేనా అన్న డైలమాలో పడిందట బీఆర్ఎస్. ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ఏదో ఒక ఆందోళ చేయాలన్న దాంట్లో మూసీపై పోరాటం చేస్తున్నామా అని బీఆర్ఎస్ నేతలు ఆలోచిస్తున్నట్లు చర్చ జరుగుతోంది.
మూసీ ప్రక్షాళనలో భాగంగా దాదాపు 16వేల ఆక్రమణలు తొలగిస్తున్నా.. అందులో మెజార్టీ జనం పేద వర్గాల వారే. వారందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని రేవంత్ సర్కార్ చెబుతోంది.ఇదే అంశం బీఆర్ఎస్ నేతలను సందిగ్ధంలో పడేసిందట. మూసీ ఆక్రమణదారుల్లో వేలాది మందికి మంచే జరుగుతుండగా తక్కువ మందికి మాత్రమే నష్టం జరుగుతోందన్న విషయాన్ని ఆలస్యంగా గ్రహించారట. మెజార్టీ పేదలకు మంచి జరిగే కార్యక్రమాన్ని అడ్డుకుని, వందల మంది కోసం ఆందోళన, పోరాటం చేస్తే రాజకీయంగా మైలేజ్ వస్తుందా రాదా అన్న డైలమాలో పడ్డారట బీఆర్ఎస్ నేతలు. అందుకే మూసీ ప్రక్షాళనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తామని ప్రకటించిన కేటీఆర్..పునరాలోచనలో పడ్డారన్న టాక్ వినిపిస్తోంది.మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు సిద్ధం చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నప్పుడే ప్లాన్ చేసి అధికారిక ఉత్తర్వులు కూడా ఇచ్చారని కాంగ్రెస్ పెద్దలు ఆధారాలతో సహా వివరిస్తున్నారు. మీరు మూసీ ప్రక్షాళన చేస్తే మంచి పని, అదే మేము చేస్తే తప్పవుతుందా అని సీఎం రేవంత్ సహా మంత్రులు ఎదురుదాడికి దిగడంతో బీఆర్ఎస్ నేతలు డైలమాలో పడ్డట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో కాస్త సర్దుకున్న బీఆర్ఎస్ నేతలు..తాము కేవలం 17వేల కోట్లతో మూసీ ప్రక్షాళన, సుందరీకరణకు ప్లాన్ చేస్తే..ఇప్పుడు ఏకంగా లక్ష కోట్లపైగా ఎందుకు ఖర్చు చేస్తున్నారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.మూసీ ప్రక్షాళన వెనక ఏదో అవినీతి దాగి ఉందని ఆరోపిస్తున్నారు గులాబీ లీడర్లు. అయితే మూసీపై ఎంత పోరాటం చేసినా, ఎన్ని నిరసనలు చేపట్టినా తమకు అంత మైలేజీ రావడం లేదన్న చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో మొదలైందని తెలుస్తోంది. ఇంతకీ మూసీపై మనం చేస్తున్న పోరాటం సరైనదేనా అన్న సందేహం కూడా వ్యక్తం అవుతోందట. మనం అధికారంలో ఉన్నప్పుడు చేయాలనుకున్న పనిని ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ చేస్తోందని..మూసీ బాధితుల కోసం ఆందోళన చేస్తున్నా అది పెద్దగా ప్రజల్లోకి వెళ్లడం లేదన్న థాట్‌లో పడిపోయారట గులాబీ నేతలు.

## క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. మొత్తం నలుగురు ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ముగ్గురు ఐఏఎస్‌లు వాకాటి కరుణ, వాణిప్రసాద్, ఆమ్రపాలి కోరగా, ఏపీలోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరిన ఐఏఎస్ అధికారిని సృజన కోరారు. ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో ఎంపికై, తెలంగాణలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులకు రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు డీవోపీటీ లేఖలు రాసింది. ప్రత్యూష్ సిన్హా కమిటీ ఏపీకి కేటాయించిన 11మంది ఐఏఎస్ అధికారుల్ని తక్షణమే సొంత రాష్ట్రాల్లో విధుల్లో చేరేందుకు రిలీవ్ చేయాలని ఆదేశించింది. 2023 జనవరిలో అప్పటి తెలంగాణ సీఎస్ సోమేష్ కుమార్ విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు మిగిలిన అధికారులకు వర్తిస్తుందని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో డీవోపీటీ కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న 11మంది ఆలిండియా సర్వీస్ అధికారులు హైకోర్టు తీర్పు నేపథ్యంలో తమకు తెలంగాణ క్యాడర్ కావాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. తాజాగా డీవోపీటీ అందుకు అనుమతించలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత ప్రత్యూష్ సిన్హా కమిటీ అధికారుల విభజన చేపట్టింది. 52: 48 నిష్పత్తిలో అధికారులను రెండు రాష్ట్రాలకు కేటాయించింది. అయితే కొంతమంది అధికారులు తమకు కేటాయించిన రాష్ట్రాలు కాకుండా ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. ఇలా పనిచేస్తున్న వారిలో కొందరు రిటైర్ అయిపోయారు. ఈ నేపథ్యంలో 11 మంది ఐఏఎస్‌లను సొంత రాష్ట్రాలకు బదిలీ చేస్తూ డీవోపీటీ రాష్ట్రాలకు లేఖ రాసింది. సోమేష్ కుమార్ వ్యవహారంలో హైకోర్టు తీర్పు తర్వాత మిగిలిన అధికారుల విషయంలో కేంద్రం స్పష్టత ఇచ్చింది. మాజీ డీజీపీ అంజనీకుమార్, రోనాల్డ్ రాస్, జె.అనంతరాము, ఎస్.ఎస్.రావత్, ప్రశాంతి ఆమ్రపాలి, అభిలాష బిస్త్, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్, తదితరుల కేటాయింపులకు సోమేశ్‌కుమార్ వ్యవహారంలో వెలువరించిన తీర్పే వర్తిస్తుందని తెలిపారు. అయితే 11 మందిలో నలుగురు ఐఏఎస్ అధికారులు మాత్రమే క్యాట్‌ను ఆశ్రయించారు.

## అక్కడ.. ఇక్కడ !? ఇక్కడ.. అక్కడ..!? మహా.. ప్రభు..!?

# మునిసిపాలిటీ శాఖ మొత్తం మీరే పరిపాలిస్తే ఎట్లా..!?



- పేరుకే శానిటేషన్ ఇన్స్పెక్టర్...
- గ్రేటర్ హైదరాబాద్, కాప్రా, దమ్మైగూడ మున్సిపాలిటీ... మొత్తం తానే పెత్తనం చెలాయిస్తున్నడా..!?
- మనోడి బాగోతం గతంలో బయటపడ్డ మారలేదేమో...!?
- అలవాటు పడ్డ ప్రాణం కదా..!?
- మున్సిపల్ కమిషనర్ ఒక్కసారి జర మీ నజర్ పెట్టండి..!?




**జయభేరి, దమ్మయిగూడ :**

దమ్మయిగూడ మున్సిపాలిటీ అధికారులకే చెమటలు పట్టించే విషయం ఇది. పేరుకే దమ్మయిగూడ మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్... కానీ ఇది దమ్మాయి గూడా మునిసిపాలిటీ కాదు, కాప్ర మునిసిపాలిటీని కూడా కాంట్రాక్టుగా తీసుకున్నాడో ఏమో తెలియదు గానీ, మస్తుగా ఎనకేసుకున్నాడనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. ఇక అసలు విషయానికొస్తే దమ్మైగూడ మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్స్పెక్టర్ ప్రభు. ఈయన దమ్మాయిగూడ పారిశుద్ధ్య కార్మికులను పక్క మునిసిపాలిటీ అయిన కాప్రా మునిసిపాలిటీలో ని జిహెచ్ఎంసి పద్మశాలి టౌన్షిప్ డివిజన్ రెండు లో తన పలుకుబడిన ఉపయోగించి ఈ సిబ్బందిని అక్కడ పని చేయించుకుంటున్నాడు ఈ మహాప్రభు..! ఇక ఈయన మునిసిపల్ శాఖలో ఆడిందే ఆట పాడిందే పాట అన్నట్టుగా సాగుతుందట మనోడి యవ్వారం.. మీరే చూడండి దమ్మైగూడ మున్సిపల్ సిబ్బందిని కాప్రా సర్కిల్ లో పారిశుద్ధ కార్మికులను ఎలా వాడు కుంటున్నాడో..!? దమ్మైగూడలో ఎక్కువ పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు కాబోలు... లేకపోతే కాపురం మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుద్ధ్య కార్మికులు తక్కువ ఉన్నారేమో..!? ఏమైందో ఏమో గాని అక్కడ ఇక్కడ !? ఇక్కడ అక్కడ...!? ఏదేమైనా ప్రభు అంటే ఏమనుకున్నావు? అన్నట్టుగా దమ్మైగూడ మున్సిపల్ సానిటేషన్ ఇనిస్పెక్టర్ ప్రభు పని నాలుగు చేతుల సంపాదించుకునే పని కాబోలు మరి అని అనుకుంటున్నారు దమ్మాయిగూడ స్థానిక ప్రజలు...!? దీనిపై కమిషనర్ మేడం పూర్తి విచారణ మొదలు పెట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు...



# ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే

- మాజీ మంత్రి, BRS పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు చేతుల మీదుగా చెక్కు అందజేత

**జయభేరి, కాప్రా :**

చర్లపల్లి డివిజన్ మధు సుధన్ రెడ్డి కాలనీకి చెందిన లింగోజీ రమేశ్ మంగమ్మ కుమార్తె తేజ శ్రీ కొత్త గూడం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి తన స్వంత నిధులతో BLR చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 29,000/ రూపాయల చెక్కును KTR చేతుల మీదుగా చెక్కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## దశదినకర్మ స్నానానికి వెళ్లి అంతలోనే అనంతలోకాలకు

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 13 :**

దశదినకర్మ కోసం స్నానానికి వెళ్లి కుంటలో పడి చనిపోయిన ఘటన వర్గల్ మండలం తునికి మక్త లో చోటు చేసుకుంది. గౌరారం ఎస్ఐ కర్ణాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వర్గల్ మండలం తునికి మక్తా గ్రామానికి చెందిన సుండు రాములు (58) పాలివారు అగు సుండు ఎల్లమ్మ మృతి చెందడంతో ఆదివారం దశదినకర్మ కోసం అంసోని కుంటలో రాములు స్నానానికి వెళ్లి కుంటలో పడి మృతి చెందినట్లు ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఎంత వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోగా.. సోమవారం కుంటలో శవమై కనిపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## దళారులను నమ్మి రైతులు నష్టపోవద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- సన్నరకం వడ్లకు ప్రభుత్వం రూ 500 బోనస్
- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 13 :**



ప్రభుత్వం ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారించగా, అన్నదాతలు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అహ్మదీపూర్ లో వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ తో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగానే సన్న రకం ధాన్యానికి రూ 500 బోనస్ ప్రకటించగా, ఈ సీజన్ నుండే వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే రైతులు విక్రయించాలని, కేవలం వారం రోజులలోపే రైతుల ఖాతాలలో సర్కార్ ధాన్యం డబ్బులు చెయ్యనున్నట్లు చెప్పారు. గ్రేడ్ ఏ వరి ధాన్యానికి రూ 2320 /_ సాధారణ ధాన్యం రకానికి రూ 2300/_ లు అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు, ఆర్ ఐ సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్ రెడ్డి, యాదగిరి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రామా గౌడ్, ఏపిఎం దుర్గాప్రసాద్, సెక్రటరీ కుమారస్వామి, సీసీ పుష్పలత, ఎఫ్ పిసి రవీందర్ చారి, కరుణాకర్, నాయకులు అంజా గౌడ్, శివారెడ్డి, ప్రభాకర్, సుఖేందర్ రెడ్డి, బాలరాజు గౌడ్, బాలు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- ఇందిరమ్మ ఇళ్ల పథకం పై కమిటి ఏర్పాటు - వజ్రేష్ యాదవ్



**జయభేరి, అక్టోబర్ 14:**

ఇందిరమ్మ ఇండ్ల కమిటి పథకంపై కమిటి ఏర్పాటు చేయనున్నట్లు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. తూంకుంట మున్సిపాలిటిలోని మొగుళ్ల వెంకట్ రెడ్డి గార్డెన్ లో ఈ నెల 15 న ఉమ్మడి శామీర్ పేట మండలాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని ఈ సమావేశానికి ఏ, బి, బ్లాక్ అద్యక్షులు, ఉమ్మడి శామీర్ పేట మండలాల అధ్యక్షులు, ప్రదాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల కమిటిల అద్యక్షులు, కార్పోరేషన్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, మేయర్, డిప్యూటి మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు తదితరులు హాజరు కావాలని ఆయన కోరారు. అదేవిధంగా సాయంత్రం 4 గంటలకు ఎన్బిఆర్ ఫంక్షన్ హాల్లో ఘట్ కేసర్ మండలం, పోచారం మున్సిపాలిటికి సంబందించి కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

## గ్రామాల్లో అందని ద్రాక్షగా మిషన్ భగీరథ పథకం

- మంచినీరు సరఫరాలో తీవ్ర ఆటంకాలు
- లక్ష్మాపూర్ లో వెలుగు చూసిన వైనం
- సమస్యను పరిష్కరించాలని కోరుతున్న ప్రజలు

**జయభేరి, అక్టోబర్ 14:**






గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం తీసుకవచ్చింది. ఈ పథకం ద్వార ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరును అందించే ఉద్దేశ్యంతో గోదావరి జలాలను ఇంటింటికి అందించాలని మిషన్ భగీరథ పథకం అట్టహాసంగా ప్రారంబించింది. కలుషిత నీరు తాగకుండా స్వచ్ఛమైన శుద్ధి జలాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశ్యంతో చేపట్టిన ఈ పథకం ప్రస్తుతం అబాసుపాలవుతోంది. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ లోని 2వ వార్డులో గత మూడు సంవత్సరాలుగా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా కాకపోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదనీ వారు వాపోతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో మినరల్ వాటర్ కొనలేక తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. గత ప్రభుత్వం ప్రజలకందరికి తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ పథకం ప్రస్తుతం నీరుగారిపోతుందంటు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం గ్రామపంచాయతి పాలక వర్గం లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. ఇట్టి సమస్యను గ్రామాధికారి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. అయితే ఈ సమస్యను పరిష్కరించడానికి గ్రామంలోని యువ నాయకులు క్యాతం మధుకృష్ణ, చిన్నలచ్చి శ్రీనివాస్ లు ముందుకు వచ్చి పైప్ లైన్ లు వేయించి రోడ్ కటింగ్ చేసిన పైప్ లైన్ కనెక్షన్ ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైప్ లైన్ కనెక్షన్ ఇవ్వాలని అడిగితే ఇంటికి రూ.500 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో గ్రామ మంచి నీటి సహయకులకు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామంలో మంచి సురక్షిత నీటిని అందించాలని ఈ శిక్షణలో పలు సూచనలు అందించారు. అయితే ప్రభుత్వ ఆదేశాలను బే ఖాతరు చేస్తూ తూతూ మంత్రంగా శిక్షణలు ఇచ్చి మిషన్ భగీరథ అధికారులు చేతులు దులుపుకున్నారు. గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయంటూ వారు వాపోతున్నారు. ఇప్పటికైన మిషన్ భగీరథ అధికారులు గ్రామంలో సంచరించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.




## స్వేరోస్ జాతీయ సదస్సు విజయవంతం చేయండి

- స్వేరోస్ వర్గల్ మండల అధ్యక్షుడు కిష్టనోల్ల స్వామి

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 14 :**

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన నిర్వహించబోయే స్వేరోస్ జాతీయ సదస్సు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్గల్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కిష్టనోల్ల స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేరోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా అనన్య సామాన్యమైన కార్యక్రమాలతో స్వేరోస్ నెట్వర్క్ పనిచేస్తుందని గురుకులాల అడ్మిషన్స్ లోనూ అగ్రగామిగా నిలపడంలో స్వేరోస్ నెట్వర్క్ పాత్ర మరువలేమని తెలిపారు. అదే సందర్భంలో స్వేరోస్ పైలాన్ కూడా ఆవిష్కరించుకోవడం జరుగుతుందని తెలిపారు. విదేశాల నుండి స్వేరోస్ పట్ల లబ్ధి పొందిన వారు వస్తారని తెలిపారు. కాబట్టి స్వేరోసు ఆర్థిక మూలాల మీద అవగాహన సదస్సు ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రతి స్వేరో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ జుట్టు రాజు, కిష్టనోల్ల సురేష్, కొమ్ము పర్శరాములు, బాగనోల్ల స్వామి, తదితరులు పాల్గొన్నారు

## మాజి మంత్రి నీ కలిసిన మున్సిపల్ చైర్మన్



**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 13 :**

దసరా పండుగను పురస్కరించుకొని మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి జమ్మి ఇచ్చి, విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి గుప్తా మరియు సిద్దిపేట కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్సి సంతోష్ గుప్తా తదితరులు ఉన్నారు.

## తిరుమలలో ఉమ్మడి మెదక్ ఎమ్మెల్సీ



**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 13 :**

తెలంగాణ రాష్ట్ర ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామినీ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలు రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని అష్టశ్వర్యాలతో ఆరోగ్యాలతో ఉండాలని, కలియుగ వైకుంఠ వాసుడైనటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆ దేవదేవుని వేడుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ తో పాటుగా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## రేణుక ఎల్లమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు

- ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవంల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

**జయభేరి, అక్టోబర్ 14:**

శామీర్ పేట్ లోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో 7 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 15 న ఎల్లమ్మ తల్లి కళ్యాణం నిర్వహించనున్నారు. కాగా ఈ కళ్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత అమ్మవారి శోభ యాత్ర

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో దేవి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా నేడు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఆర్య వైశ్య సంఘం కమిటీ వారి పిలుపు మేరకు శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి మాత ఆలయంలో నిర్వహించిన శ్రీ వాసవి మాత అమ్మవారి పూజ మరియు శోభ యాత్రలో పాల్గొని, వేద పండితులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం ఆర్య వైశ్య సంఘం వారు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఆ జగన్మాత ఆశీస్సులతో దేవరకొండ నియోజకవర్గం ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో కనకదుర్గమ్మ అమ్మవారి దీవెనలు, ఆశీస్సులు దేవరకొండ నియోజకవర్గం ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన విభాగ నాయకులు దేవరకొండ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ నల్గొండ జిల్లా మాజీ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య గుడి అధ్యక్షులు కార్యదర్శి కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.




## వికలాంగులకు ప్రైవేటు రంగంలో నాలుగు శాతం రిజర్వేషన్లు

జయభేరి, హైదరాబాద్:

సచివాలయంలో తెలంగాణ వికలాంగుల జాబ్ పోర్టల్ ను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం ఆవిష్కరించారు. మహిళా సంక్షేమ శాఖ డైరెక్టరెట్ హెల్ప్ లైన్ లో పదిమందికి అపాయింట్మెంట్ ఆర్డర్లు అందజేసారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళా శిశు సంక్షే మ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, వికలాంగుల సహకార కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, దివ్యాంగులు వయోవృద్ధులు సాధికారత శాఖా జేడీ శైలజ తదితరులు హజరయ్యారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉపాధి రంగాల్లో దివ్యాంగులకు అవకాశాలు తక్కువ . ఇతర వర్గాల వర్గాల వారిలా ఫైట్ చేయాలంటే ఎన్నో అవరోధాలు వున్నాయి. శారీరకంగా వచ్చే లోపం మన చేతిలో లేదు. పోషకాహార లోపం,ప్రమాదం వల్ల వికలాంగులుగా మారే ప్రమాదం వుంది. అందుకే వాళ్లకి ఉపాది అవకాశాలు కల్పించేందుకు ఆన్లైన్ జాబ్ పోర్టల్ ను ప్రారంభిస్తున్నామని అన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు పాటించాలి. దివ్యాంగులు కంపెనీల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. ఆన్లైన్ జాబ్ పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుంటే చాలు. వారి అర్హతను బట్టి ఉద్యోగాలు వస్తాయి. దుకోసమే పోస్టల్ లో అందుబాటులోకి తెచ్చాము. సంక్షేమ నిధుల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నాం. ప్రైవేట్ జాబ్లో నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గతంలో ఒక శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి పెంచెందుకు ప్రయత్నిస్తున్నాం. ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు పాటిస్తాం. సబిలిటీని దృష్టిలో పెట్టుకొని వారిని ముందుకు తీసుకురావడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. సంక్షేమము, విద్యా, ఉద్యోగ రంగంలో దివ్యాంగులకు చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి వుందని అన్నారు.


## బైక్ ని ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

- బైకుపై ఉన్న వ్యక్తి మృతి

జయభేరి, మేడ్చల్:

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎన్ఎఫ్ సి నగర్ ఫ్లైఓవర్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపుకి వెళ్లే దారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్ పై ఉన్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## కొండా రాజీనామా లేనట్టే...



జయభేరి, వరంగల్, అక్టోబరు 14:

తెలంగాణ రాజకీయాల్లో కొండా సురేఖ ఓ చిన్న సునామీనే సృష్టించారు. ఓ సోషల్ మీడియా పోస్టు ద్వారా రేగిన దుమారం కొండా సురేఖ కేటీఆర్‌పై చేసే ఆరోపణల క్రమంలో నాగార్జున కుటుంబాన్ని టార్గెట్ చేయడంతో అసలు వివాదం ప్రారంభమయింది. రాజకీయాలతో సంబంధం లేని సినీ కుటుంబాన్ని టార్గెట్ చేయడంపై ఇండస్ట్రీ ఘాటుగా స్పందించింది. అయితే తర్వాత కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లుగా ప్రకటించారు. కానీ వివాదం మాత్రం కొనసాగుతోంది. కొండా సురేఖపై నాగార్జున రెండు పరువు నష్టం పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై వాంగ్మూలాలు నమోదు చేస్తున్నారు. ఇప్పుడు ఆ అంశానికి ప్రాధాన్యత లేదని కోర్టుకు చేరిందని ఇక రాజకీయం ఏమీ లేదని కాంగ్రెస్ తేల్చేసోంది. సురేఖతో రాజీనామా చేయించాలని హైకమాండ్ తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నేతలకు సూచనలు చేసినట్లుగా ప్రచారం జరిగింది. ప్రియాంకా గాంధీ అక్కినేని అమలతో మాట్లాడారని కూడా చెప్పుకున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ వైపు నుంచి కొండా సురేఖను రాజీనామా చేయాలని అడిగినట్లుగా లేదని కనీసం మందలించినట్లుగా కానీ ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. పైగా కొండా సురేఖ ఒంటరి కాదని ఆమెను అదే పనిగా టార్గెట్ చేస్తే మేమంతా ఉన్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ నేరుగానే హెచ్చరికలతో కూడిన ప్రకటనలు చేశారు. ఆ తర్వాత నాగార్జునపై కబ్జా కేసు కూడా నమోదు అయింది. ఈ పరిణామాలను బట్టి చూస్తే కొండా సురేఖకు కాంగ్రెస్ పూర్తి స్థాయిలో మద్దతుగా నిలిచిందని స్పష్టమవుతోదంని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖ వివాదాస్పద వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎక్కడా స్పందించలేదు. కానీ కేటీఆర్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేసిన తర్వాత ఓ మీడియా సమావేశంలో పరోక్షంగా స్పందించారు. కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను కామెడీ చేశారు. పరువు నష్టం దాఖలు చేశారట.. పరువు నష్టం పిటిషన్ అని ఎద్దేవా చేసే ప్రయత్నం చేశారు. ఆ ప్రకారం చూస్తే కొండా సురేఖ విషయంలో రేవంత్ రెడ్డి ఏ మాత్రం అసంతృప్తికి గురి కావడం జరగలేదని ఆమెకు పూర్తి స్థాయిలో సపోర్టుగా ఉన్నారని అర్థమవుతుంది. నిజానికి ఇలాంటి రాజకీయ వివాదాలు వచ్చినప్పుడు సొంత పార్టీ నేతలకు నైతికంగా మద్దతుగా నిలకవకపోతే పార్టీ నేతల్లో స్థైర్యం తగ్గిపోతుంది. తమపై విపక్షాలు ఏదైనా వివాదాలు సృష్టించినా ఇంతేనా అనుకుంటారు. అదే సమయంలో విపక్ష పార్టీలకు బలం వస్తుంది. అలాంటి వివాదాలను మరిన్ని తెరపైకి తెస్తారు. ఈ రాజకీయంపై రేవంత్ రెడ్డికి స్పష్టత ఉంది కాబట్టి బీఆర్ఎస్ ట్రాప్‌లో పడలేదని చెబుతున్నారు. నాగార్జున విషయంలో కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి సానుకూల అభిప్రాయం లేదు. బీఆర్ఎస్ నేతలతో నాగార్జునకు మంచి సంబంధాలు ఉన్నాయనేది బహిరంగరహస్యం. ఆయన ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ఆర్థిక వనరుల పంపిణీలో ఒక టూల్ అని గట్టిగా నమ్ముతారు. అందుకే కొండా సురేఖ వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పెద్దగా స్పందించలేదు. సురేఖకు నైతిక మద్దతు అందించారు. కొండా సురేఖకు అండగా ఉండటంలో రేవంత్ పర్ ఫెక్ట్ స్ట్రాటజీని పాటించారని కాంగ్రెస్ వర్గాలు కూడా సంతృప్తిగా ఉన్నాయి.

## టీజీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ హాల్ టికెట్లు విడుదల

జయభేరి, హైదరాబాద్:

టీజీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు హాల్‌టికెట్లను తన అధికారిక వెబ్‌సైట్‌లో టీజీపీఎస్సీ పొందుపరిచింది. ఈ నెల 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 31,382 మంది అభ్యర్థులు గ్రూప్1 మెయిన్స్‌కు అర్హత సాధించారు.

# ప్రతీ జిల్లాలో పాలియాటీవ్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు చేస్తాం

- నగరంలోని స్పర్శ్ హాస్పిస్, పాలియాటీవ్ సెంటర్ ఆధ్వర్యంలో వరల్డ్ హాస్పిస్ అండ్ పాలియాటీవ్ డే కార్యక్రమం
- స్పర్శ్ సేవలు అద్భుతం, ఇలాంటి సేవలు ఆదర్శనీయం..: రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

జయభేరి, హైద్రాబాద్, అక్టోబర్ 14:



రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో కనీసం ఒక పాలియాటీవ్ కేర్ సెంటర్ ప్రారంభించేలా కృషి చేస్తానని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. నగరంలోని కాజాగూడ వేదికగా స్పర్శ్ హాస్పిస్, పాలియాటీవ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ హాస్పిస్ అండ్ పాలియాటీవ్ డే కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తృప్తి, ధైర్యం, సాంత్వన, కోరిక, ఆశ అనే తపనతో గుళ్ళు గోపురాలు తీర్థయాత్రలు చేస్తాం. కానీ అసలైన దేవాలయం, అసలైన సేవ ఈ స్పర్శ్ లాంటి వేదికల్లో లభిస్తుందని తెలిపారు. మన పూర్వీకులు తెలిపిన మానవసేవే మాధవ సేవ అని నానుడికి పర్యాయపదం ఈ స్పర్శ్ సంస్థ అని అన్నారు. ఇక్కడ సేవలు చూసి భావోద్వేగానికి లోనయ్యానని, అంకితభావంతో ఇక్కడ చేసే సేవలు ఆశ్చర్యాన్ని గురిచేసాయని పేర్కొన్నారు.
ఇక్కడ అవస్థలతో కూడిన పేషంట్ల బావోద్వేగాలను సమన్వయ పరుస్తున్న తీరు, కౌన్సిలింగ్ వ్యవస్థ, అంకితభావంతో చేస్తున్న స్వచ్ఛమైన సేవ తన మనస్సును హత్తుకున్నాయని వెల్లడించారు. ఇలాంటి సెంటర్లను ప్రభుత్వ ఆధ్వర్యంలో కూడా ప్రారంభించే ప్రయత్నాలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం ఒకటైన ఏర్పాటు చేయడం పాలసీగా ముందుకు తీసుకువెళతామన్నారు. కేన్సర్ వంటి దీర్ఘకాలిక రోగాల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది, ఈ సంఖ్యకు అనుకూలంగా ప్రభుత్వం ఆరోగ్య శాఖ నుంచి అదే స్థాయిలో స్పందన ఉంటుందని పేర్కొన్నారు. అంతిమ దశలో స్వాంతన అందించే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా పాలియాటీవ్ కేర్ సేవలను కూడా ఆరోగ్య శ్రీ లో చేర్చాలని స్పర్శ్ ప్రతినిధులు కోరగా, దీనిని కార్య రూపం దాల్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
అనంతరం స్పర్శ్ హాస్పిస్ ట్రస్టీ సభ్యులు డా. సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఈ సంస్థను 2011లో ప్రారభించి ఉచితంగా పాలియాటీవ్ సేవలు అందించడమే కాకుండా దీని పైన అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ మధ్యకాలంలో పాలియాటీవ్ కేర్ గురించి విరివిగా వింటున్నాం, దీనికోసం 13 ఏళ్లుగా వివిధ వేదికల్లో అవగాహన కల్పిస్తూ కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించి గతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సంస్థ సొంత భవనం నిర్మించుకుని సేవలు అందిస్తున్నామని, ఈ ఉచిత సేవలకై ప్రతి నెల దాదాపు 50 లక్షలు ఖర్చు పెడుతున్నామని, ప్రతి రూపాయి దాతలు నుంచి సేకరించి ఖర్చు చేస్తున్నామని అన్నారు. ఈ పాలేటివ్ కేస్ కేవలం 1% మాత్రమే ఉపయోగిస్తున్నారని ఈ సంఖ్య పెరిగాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. స్పర్శ్ సేవలకు నెలకు 500 అంతకన్నా ఎక్కువ విరాళం అందించేలా గార్డియన్ ఆఫ్ స్పర్శ్ పేరిట నూతన కార్యక్రమం ఏర్పాటు చేశామని, అందరూ దీనికి సహాకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ కారుణ్య, ప్రముఖ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా. చిన బాబు, రోటరీ క్లబ్ సభ్యులు, స్పర్శ్ సేవలు పొందిన పేషెంట్ల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ మండల పరిధిలోని కొండభిమనపల్లి గ్రామ వ్యవసాయ గోదాం వద్ద ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్ లో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం దేశంలో ఏ రాష్ట్రం చెయ్యని విధంగా మూడు దఫాలుగా రైతులకు సుమారు లక్ష రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డికి దక్కుతుంది. రైతు రుణమాఫీ కానీ వారు ఎవరు అధైర్య పడవద్దని టెక్నికల్ ఇబ్బంది ఉన్న వారిని వ్యవసాయ శాఖ మంత్రి సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యే విధంగా చేస్తానని హామీ ఇచ్చారు.రుణమాఫీ కానీ వారికి కూడా త్వరలో వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు. రైతు బిడ్డగా రైతు కష్టం తెలిసిన ముఖ్య మంత్రిగా, రైతులు అప్పుల్లో పుట్టి అప్పులతో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రాష్ట్రవ్యాప్తంగా 39 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకోవడం జరిగింది. కానీ ప్రతిపక్షాలు అవాక్కులు చేవాక్కులు పేలుతూ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు దీనిని రాష్ట్ర ప్రజానికం చూస్తున్నారు ప్రజలు రెండు సార్లు కర్రు కాల్చి వాత పెట్టిన కూడా బుద్ధి లేకుండా ఫామ్ హౌస్ లో కూర్చొని రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫామ్ హౌస్ లో కూర్చొని విమర్శలు చేస్తూ, మాజీ మంత్రి ట్విట్టర్, సోషల్ మీడియా వేదికల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారు కానీ మన ప్రజా ప్రభుత్వం లో మన సిఎం రేవంత్ రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎల్లప్పుడూ అందుబాటు ఉంటూ ప్రజా సమస్యల మీద సమయం కల్పిస్తూ వాటిని పరిష్కరిస్తున్న వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి ప్రజల కోసమే ప్రజల వద్దకు ప్రజాపాలన తీసుకువచ్చిన ఒక గొప్ప వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లోకాసాని శ్రీదర్ రెడ్డి,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, RDO శ్రీరాములు, ఎంపీడీవో ఢానియల్, సివిల్ సప్లయి RI శ్రీనివాస్,DTCS హన్మంతు శ్రీనివాస్ గౌడ్,ADA తదితరులు పాల్గొన్నారు.

# దుర్గామాత శోభాయాత్ర

జయభేరి, ఘట్కేసర్ :



దేవి నవరాత్రులలో భాగంగా ఘట్కేసర్ మున్సిపాలిటీలో ఎదులాబాద్, గోల్డెన్ యూత్, రోడ్డులో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా దుర్గామాత నిమజ్జనానికి ఊరేగింపు కార్యక్రమాలో పాల్గొన్న ఘట్కేసర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రెష్ యాదవ్, బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముత్యాలు యాదవ్ ప్రతీ సంవత్సరం దేవి నవరాత్రులు ఏర్పాటు భారీ ఎత్తున నిర్వహిస్తారు,తెలంగాణా సంస్కృతిక కార్యక్రమాలు, పక్క రాష్ట్రాల బ్యాండ్ తో ఘట్కేసర్ పట్టణ ప్రజలకు సరికొత్త నాటక బృందాలను చూపిస్తాడు, అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని ప్రార్థిస్తున్నాను. ఈ కార్యక్రమంలో పార్టీ మండల్ అధ్యక్షులు కర్రె రాజేష్, పోచారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గడ్డి అన్నారం డైరెక్టర్ చిలుకూరి మచందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, k. నాగరాజు, బొక్క సంజీవరెడ్డి, కౌన్సిలర్లు కడుపోల మల్లేష్, మాజీ వార్డ్ సభ్యులు, ఉమ్మడి ఘట్కేసర్ మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.





## వడివడిగా చంద్రయాన 4 అడుగులు

జయభేరి, నెల్లూరు, అక్టోబరు 14:

చంద్రయాన్4 మిషన్‌కి సంబంధించి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో భారత అంతరిక్ష పరిశోధన రంగంలో మరో ముందడుగు పడింది. అంతరిక్ష పరిశోధనల్లో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించే దిశగా ఏరోస్పేస్ స్టార్టప్ సంస్థ 'స్పేస్ కిడ్జ్ ఇండియా'.. సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇస్రో చంద్రయాన్4 మిషన్‌లో ప్రయోగించేలా ఉపగ్రహాన్ని తయారు చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది.అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ ఇచ్చేందుకు శక్తిశాట్ అనే మిషన్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో.. భాగంగా 108 దేశాలకు చెందిన 12,000 మంది బాలికలకు అంతరిక్ష సాంకేతికతపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన అధికార పోస్టర్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము త్వరలో ఆవిష్కరించనున్నారు. ఈ శక్తిశాట్ మిషన్ ద్వారా 108 దేశాలకు చెందిన 14 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్న 12,000 మంది హైస్కూల్ విద్యార్థినులకు స్పేస్ టెక్నాలజీ, పేలోడ్ అభివృద్ధి, వ్యోమనౌక వ్యవస్థల గురించి ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నారు. బ్రిటన్, యూఏఈ, బ్రెజిల్, కెన్యా, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, గ్రీస్, శ్రీలంక తదితర దేశాలు ఇందులో భాగస్వామ్యమవుతున్నాయి. శిక్షణ అనంతరం ప్రతి దేశం నుంచి ఒక విద్యార్థిని చొప్పున 108 మందిని ఎంపిక చేస్తారు. వీరికి పేలోడ్‌లు, స్పేస్‌క్రాఫ్ట్ ప్రోటోటైప్‌లను రూపొందించడంలో శిక్షణ ఇస్తారు. ఇస్రో చంద్రయాన్4 మిషన్‌లో ఉపగ్రహాన్ని ప్రయోగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ ముందు మోడల్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ఈ శక్తిశాట్ మిషన్ కేవలం మన దేశానికే కాకుండా మొత్తం ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చే సామర్థ్యం కలిగి ఉందని మిషన్‌కు నేతృత్వం వహిస్తున్న కేసన్ తెలిపారు. బాలికలను ప్రోత్సహించడం ద్వారా సాధికారతను కల్పించడం, జీవితాలను మార్చే అవకాశాలను అందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. స్పేస్ కిడ్జ్ ఇండియా ఇప్పటి వరకు 18కి పైగా బెలూన్ శాటిలైట్లు, 3 సబ్ ఆర్బిటల్ పేలోడ్‌లు, 4 ఆర్బిటల్ ఉపగ్రహాలను ప్రయోగించింది. హైస్కూల్, కాలేజీ విద్యార్థుల సాయంతో ఉపగ్రహాలను ప్రయోగించిన మొట్టమొదటి సంస్థగా గుర్తింపు పొందింది.

# పీపీపీలో రోడ్ల నిర్మాణం

జయభేరి, విజయవాడ, అక్టోబరు 14:



ఏపీలో రోడ్లను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పీపీపీ మోడల్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ మేరకు 100 రోజుల ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రణాళికను ఖరారు చేసి రెండు నెలల్లో ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించాల్సి ఉంటుందిరాష్ట్రంలోని రోడ్ల నిర్మాణం ఇకపై ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌లో జరగనున్నాయి. దీని కార్యాచరణ ఖరారు చేయడానికి ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కమిటీ నియమించింది. ఈ కమిటీ కార్యాచరణను ఖరారు చేసి రెండు నెలల్లో ప్రభుత్వానికి రిపోర్టు సమర్పించాల్సి ఉంటుంది. ఈ మేరకు రవాణా, రోడ్లు, భవనాల డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.రోడ్లు, భవనాలు (ఆర్అండ్‌బీ) డిపార్ట్‌మెంట్, ఏపీ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) పీపీపీ పద్ధతిలో రోడ్ల నిర్మాణం కోసం వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. 2024 సెప్టెంబర్ 13న ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఆర్‌డీసీ) మేనేజింగ్ డైరెక్టర్, రోడ్లు, భవనాలు (ఆర్అండ్‌బీ) చీఫ్ ఇంజినీర్ పంపిన లేఖలో ప్రభుత్వం శాఖల వారీగా వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రారంభించిందని తెలిపినట్లు ఉత్తర్వుల్లో సెక్రటరీ కాంతిలాల్ దండే తెలిపారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రోడ్లు, భవనాల డిపార్ట్‌మెంట్‌కు కేటాయించిన అంశాలలో "రోడ్ల నిర్మాణంలో పీపీపీ విధానం ఆమోదం" ఒకటని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.దీని ప్రకారం రోడ్ల నిర్మాణం కోసం విధానాన్ని 100 రోజుల్లో ఆమోదించాలి. రాష్ట్రంలో ఆర్ అండ్ బీ డిపార్ట్‌మెంట్‌లో రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలించిన తరువాత రాష్ట్రంలో ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్‌లో రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ప్రణాళికను ఖరారు చేయడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ పాలసీని సిద్ధం చేయడానికి, ప్రణాళికను ఖరారు చేయడానికి ఐదుగురు సభ్యులతో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది.

ఈ కమిటీలో కన్వీనర్‌గా చీఫ్ ఇంజినీర్ (ఆర్అండ్‌బీ) ఎస్‌హెచ్, ఎండీ, ఏపీఆర్‌డీసీ, సభ్యులుగా ఇంజినీర్ఇన్‌చీఫ్ (ఆర్అండ్‌బీ) ఎండీఆర్ఎస్, అడ్మినిస్ట్రేషన్, చీఫ్ ఇంజినీర్ (ఆర్అండ్‌బీ) ఎన్‌హెచ్ & సీఆర్ఎఫ్, డిప్యూటీ ఆర్థిక సలహాదారు సురేంద్ర దత్తి, పీపీపీ నిపుణుడు షాలెం రాజు ఉన్నారు. అయితే పాలసీ ఖరారు చేసి కమిటీ నివేదికను రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా చీఫ్ ఇంజినీర్ (ఆర్అండ్‌బీ) ఎస్‌హెచ్ & ఎండీ, ఏపీఆర్‌డీసీ, అండ్ కమిటీ కన్వీనర్‌కు నిర్దేంచారు.సీఎం చంద్రబాబు పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత నిర్వహించిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర రహదారులను కూడా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) మోడల్‌లో చేపట్టాలని నిర్ణయించారు.

ఈ మేరకు రోడ్లు, భవనాల మంత్రిత్వ శాఖను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటి వరకు జాతీయ రహదారులకే పరిమితం అయిన టోల్ టాక్స్, ఇప్పుడు రాష్ట్ర రహదారులకు కూడా వర్తిస్తుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే రోడ్డు ట్యాక్స్ పెరిగి, భరించలేని విధంగా ఉన్న నేపథ్యంలో ఇప్పుడు రాష్ట్ర రాహదారులపై టోల్‌గేట్లు పెట్టి టోల్ ట్యాక్స్ వసూలు చేస్తే అదనపు భారమే అవుతుందని వాహనదారులు అంటున్నారు.

దీనివల్ల ప్రజలపై భారాలు పడతాయని ప్రతిపక్షాలు పేర్కొంటున్నాయి.రాష్ట్రంలో 8,500 కిలో మీటర్ల మేర జాతీయ రహదారులు, 12,653 కిలో మీటర్ల మేర రాష్ట్ర రహదారులు, 32,725 కిలో మీటర్ల మేర జిల్లా రహదారులు ఉన్నాయి. జాతీయ రహదారుల పై ప్రయాణించే ప్రయాణికులకు, వాహన యజమానులకు టోల్ ఛార్జీల భారం పడుతోంది. ఇప్పుడు 12,653 కిలో మీటర్ల మేర ఉన్న రాష్ట్ర రహదారులను పీపీపీ పద్ధతిలో చేపట్టి టోల్ వసూలు చేస్తే ప్రజల పై భారం అధికమవుతుంది. 12,653 కిలో మీటర్ల రాష్ట్ర రహదారులు కూడా పీపీపీ పద్దతిలో చేపట్టి టోల్ వసూలు చేసేందుకు గతంలో టీడీపీ ప్రభుత్వం 2016లోనే నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు రాష్ట్రంలో 31 రోడ్లను పీపీపీ పద్ధతిలో చేపట్టాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. కానీ అప్పటికే కరెంటు ఛార్జీలు పెంపు, రాష్ట్రంలో ప్రత్యేక హోదా ఉద్యమంతో అది కాస్తా మధ్యలోనే ఆగిపోయింది. అయితే 2019 ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి చెంది, వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అది ఆగిపోయింది.

మళ్లీ ఇప్పుడు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు నాటి నిర్ణయాన్ని అమలు చేయాలని యోచిస్తున్నారని సమాచారం. గతంలో గుర్తించిన 31 రోడ్లలో 14 రోడ్లను 1,000 కిలో మీటర్ల పరిధిలో యుద్ధ ప్రాతిపదికన పీపీపీ మోడల్‌లో చేపట్టేందుకు కార్యచరణను రూపొందించాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. తాజాగా రోడ్ల నిర్మాణం కోసం పీపీపీ విధానాన్ని ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది

# గవర్నర్ గిరీ కోసం నల్లారి...



జయభేరి, తిరుపతి, అక్టోబరు 14:

నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రిగా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి పరిచయం అక్కరలేని పేరు. ఆయన అతి కొద్ది కాలమే ముఖ్యమంత్రిగా పనిచేసినా ఉభయ రాష్ట్రాల్లో ప్రజలందరికీ సుపరిచితమే. ఎందుకంటే రాష్ట్ర విభజన జరిగిన సమయంలో తెలంగాణ వాదులకు విలన్ గా, ఆంధ్రప్రదేశ్ వాసులకు హీరోగా నిలిచిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఇప్పుడు దశాబ్దకాలం తర్వాత రాజకీయ మనుగడ కోసం తంటాలు పడుతున్నారు. పార్టీలు మారినా ప్రయోజనం లేదు. రాష్ట్ర విభజన తర్వాత సొంత పార్టీని పెట్టుకున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని ఏపీ ప్రజలకు కూడా ఆదరించలేదు. లాస్ట్ బాల్ సిక్స్ కొడతా అంటూ బీరాలు పలికిన నల్లారికి చివరకు రాజకీయంగా ఆశాభంగమే ఎదురయింది.. రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. తర్వాత కాంగ్రెస్ లో ఆయన ఇమడ లేకపోయారు. మొన్నటి ఎన్నికలకు ముందు భారతీయ జనతా పార్టీలోకి మారారు. ఈసారైనా ఫేట్ మారుతుందని ఆయన గట్టిగా విశ్వసించారు. ఎందుకంటే 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కుదిరింది. దీంతో రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా ఆయన బీజేపీ తరుపున బరిలోకి దిగారు. ఎంత మంది ప్రచారం చేసినా ఆయన గెలుపును సాధించలేకపోయారు. మళ్లీ రాజకీయాలకు దూరంగానే నిలిచిపోయారు. ఆయనకు ఎందుకో పాలిటిక్స్ కలసి రావడం లేదనిపిస్తుంది.. కానీ తాజాగా ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలవడంపై కూడా పెద్దయెత్తున ఏపీ రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. అసలు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చంద్రబాబును కలవాల్సిన అవసరం ఏంటి? ఇద్దరి మధ్య ఖచ్చితంగా ఏపీ రాజకీయాలపైనే చర్చ జరిగి ఉంటుంది. అందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. ఎందుకంటే ఒకనాడు బద్ధశత్రువులుగా, అసెంబ్లీలో ఒకరిపై ఒకరు విమర్శించుకున్న ఈ నేతలిద్దరూ ఒక చోట చేరి మాట్లాడుకున్నారంటే అందులో పెద్ద మర్మమే ఉంటుంది. ఊరికే కలవరు మహానుభావులు అన్నట్లు వీరిద్దరి సమావేశం తర్వాత ఏపీ రాజకీయాల్లో అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి ఆంధ్రప్రదేశ్ నుంచి త్వరలో మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. అందులో ఒకటి తనకు ఇవ్వాలని నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చంద్రబాబును కోరినట్లు తెలిసింది. పదవి కోసం పదేళ్లుగా పరితపిస్తున్న నల్లారి చంద్రబాబుతో ఆఖరి ప్రయత్నం చేశారంటారు. బీజేపీ కోటాలో తనకు రాజ్యసభ పదవి ఇస్తే పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి చెక్ పెట్టగలనని చెప్పినట్లు తెలిసింది. అయితే చంద్రబాబు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి చేసిన ప్రతిపాదనపై ఎలా రియాక్ట్ అయ్యారో తెలియదు కానీ, సోషల్ మీడియాలో మాత్రం బీజేపీకి కేటాయిస్తే మాత్రం నల్లారికి ఇచ్చే విధంగా ఒప్పందం కుదిరినట్లు వార్తలు వస్తున్నాయి. మరొక ప్రచారం కూడా నడుస్తుంది. ఏపీ మంత్రి వర్గంలో ఒకరికి ఛాన్స్ ఉంది. చిత్తూరు జిల్లాలో మంత్రి పదవి ఎవరికీ దక్కలేదు. దీంతో మంత్రివర్గంలో తన సోదరుడు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి చోటు కల్పించాలని ఆయన కోరినట్లు తెలిసింది. మరి ఏం జరుగుతుందన్నది చూడాల్సి ఉంది.

# బఫర్ జోన్, ఎఫ్,టీఎల్ లో గుర్తించేది ఎలా...

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 14:

హైడ్రా వ్యవస్థ తర్వాత హెచ్ఎండీఏ పరిధిలో ఇళ్లు, ప్లాట్లు కొనే విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ తెలుసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు HMDA ప్రత్యేక వెబ్ సైట్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది.హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద నగరాల్లో స్థలాలకు, ఇళ్లకు, ఫ్లాట్లకు భారీగా డిమాండ్ ఉంటుంది. శివారు ప్రాంతాల్లో కూడా ఇదే రేంజ్ ఉంటుంది. అయితే కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ స్థలాల్లో, చెరువుల్లో, నాలాల్లో, అటవీ ప్రాంతాల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తుంటారు. ఇలాంటి వాటిని కొని చాలా మంది నష్టపోతుంటారు. చెరువులు, నాలాల రక్షణే ప్రధాన ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం హైడ్రా వ్యవస్థను తీసుకొచ్చింది. చెరువులు, నాలాల పరిధిలో నిర్మించిన ఇళ్లను కూల్చివేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో చాలా మంది ఇళ్లు లేదా స్థలాలు కొనుగోళ్లు చేసే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ముఖ్యమంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ వివరాలు తెలుసుకోవాలి. ఈ వివరాలను సింపుల్ గా తెలుసుకునేందుకు వీలుగా HMDA ఏర్పాట్లు చేసింది. హెచ్ఎండీఏకు చెందిన https://lakes.hmda.gov.in/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి చెరువుల వివరాలతో పాటీ ఎఫీటీఎల్, బపర్ జోన్ మ్యాప్ లను పొందవచ్చు. ఫలితంగా ఓ అంచనాకు రావొచ్చు. పైన పేర్కొన్న వెబ్ సైట్ లోకి వెళ్తే... జిల్లా, మండలం, గ్రామం సెలెక్ట్ చేసుకోవాలి. సర్వే నంబరును ఎంట్రీ చేస్తే ఆ ఊరిలోని అన్ని చెరువుల వివరాలు తెలుసుకోవచ్చు. ఎఫ్‌టీఎల్ కాలమ్ కూడా ఉంటుంది. క్లిస్ చేస్తే మ్యాప్ ఓపెన్ అవుతుంది. వెబ్ సైట్ లో క్యాడస్ట్రల్ అనే ఆప్షన్ ఉంటుంది. దీనిపై క్లిక్ చేస్తే మరో మ్యాపు ఓపెన్ అవుతుంది. దీంతో ఆ చెరువు ఏయే సర్వే నంబర్ల పరిధిలో ఉందో తెలుస్తుంది. మ్యాప్‌లో నీలి రంగు లైన్‌తో ఉన్నది ఎఫ్‌టీఎల్ పరిధిని సూచిస్తుంది. ఆ పక్కనే రెడ్ కలర్‌తో ఉన్నదే బఫర్‌జోన్.

# బుల్లితెర నటి కారుకు యాక్సిడెంట్..

ప్రముఖ బుల్లితెర నటి శ్రీవాణి ప్రయాణిస్తోన్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో శ్రీవాణికి తీవ్ర గాయాలయ్యాయి. నుదిటి మీద చీరుకుపోవడంతో పాటు చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. ప్రస్తుతం ఆమె గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని నటి భర్త విక్రమాదిత్య ఒక వీడియో ద్వారా వెల్లడించాడు. ప్రముఖ బుల్లితెర నటి శ్రీవాణి ప్రయాణిస్తోన్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో శ్రీవాణికి తీవ్ర గాయాలయ్యాయి. నుదిటి మీద చీరుకుపోవడంతో పాటు చేతికి ఫ్రాక్చర్ అయ్యింది. ప్రస్తుతం ఆమె గుంటూరులోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని నటి భర్త విక్రమాదిత్య ఒక వీడియో ద్వారా వెల్లడించాడు. మూడు రోజుల క్రితం శ్రీవాణి తన కుటుంబ సభ్యులతో చీరాల బీచ్‌కి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు విక్రమాదిత్య చెప్పుకొచ్చాడు. శ్రీవాణికి నుదుటిపై గట్టి దెబ్బ తగలడంతో ప్లాస్టిక్ సర్జరీ చేయమని ఆయన డాక్టర్స్ ను కోరారట. ప్రస్తుతం టీవీ సీరియల్స్ షూటింగులతో బిజీగా ఉంటోన్న తన ఒంటిపై మార్క్స్ కనిపించడకుండా ఉండేందుకు అలా కోరారట. అయితే నుదుటిపై చర్మం డీప్ గా తెగిపోయిందని, వాటికి స్టిచెస్ మాత్రమే వేయాలని ప్లాస్టిక్ సర్జరీ పనికి రాదని డాక్టర్స్ తనతో చెప్పారని విక్రమాదిత్య ఈ వీడియోలో వెల్లడించాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. దీనిని చూసిన పలువురు బుల్లితెర ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శ్రీవాణి త్వరగా కోలుకోవాలని కామెంట్స్ పెడుతున్నారు. కాగా శ్రీవాణి, విక్రమాదిత్య ఇద్దరూ కలిసి భార్యాభర్తలుగా ఒక సీరియల్ లో నటించడానికి రెడీ అయ్యారట. అయితే ఇంతలోనే ఈ ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు విక్రమాదిత్య.

# దసరా పోయింది.. దీపావళికైనా...

జయభేరి, నిజామాబాద్:



సార్ మంత్రి అవుదామనుకుంటున్నా. ఆగవయా నువ్వొకడివి. అసలే అధిష్టానం ఒప్పుకుంట లేదు. సార్ ఇప్పుడేమైంది. మంచి రోజులు లేవయా బాబు. సార్ దసరా వచ్చేసింది. మనం అధికారంలోకి వచ్చి కూడా ఏడాది కాబోతుంది. అమాత్య అదృష్టం ఎప్పుడు. అమాస అడ్డమొస్తుంది. దీపావళి అయిపోని అధిష్టానం ఒప్పుకుంటే అప్పుడు చూద్దాం. అవునా సార్.. ఇంకెన్నాళ్లు ఈ ఎదురుచూపులు. మేము ఈశ్వర్‌కి శపథ్ లేతాహు అని అనేదెప్పుడు అని నిరుత్సాహంలో ఉన్నారట ఆశావాహులు. అమాత్య పదవి రేసులో ఉన్నోళ్లు ఓవైపు డ్రీమ్స్‌లో.. మరోవైపు డైలమాలో ఉన్నారట.సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి వాళ్లలో ఆశలు చిగురిస్తుంటాయ్. ఆయన హస్తిన నుంచి వచ్చాక గుడ్ న్యూస్ ఏం లేదని తెలిసి.. సల్లబడిపోతారు. ఇట్ల ఐదారు సార్లు ఎదురుచూసి..ఎప్పుడైతే గప్పుడాయని..విస్తరణ జరిగితే మాత్రం బెర్త్ దక్కేలా ప్రయత్నాలు చేసుకుంటున్నారట. అయితే దసరా పండుగ మరోసారి ఆశావాహుల్లో ఆశలు రేపింది. కానీ ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేదన్న సంకేతాలు ఇచ్చిందట అధిష్టానం.

దీంతో దీపావళి తర్వాతే క్యాబినెట్ ఎక్స్‌పాన్షన్ ఉంటుందన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. ఇంకేముంది అమాత్య బెర్తులు ఆశిస్తున్న వారంతా ఒక్కసారిగా నీరుగాపోయారని తెలుస్తోంది.మంత్రి వర్గ విస్తరణపై చాలామంది ఎమ్మెల్యేలు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఈసారి తమకు మంత్రి పదవి దక్కడం ఖాయమని తమ అనుచరులతో దీమాగా చెప్తున్నారట. కొంతమంది ఎమ్మెల్యేలు అయితే తమకు అనుకూలంగా మీడియాలో పెద్ద ప్రచారం కూడా చేయించుకుంటున్నారట. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి.. తమకు మంత్రి పదవి ఖాయమన్నట్లుగా ఫీలవుతున్నారట. సీఎం ఢిల్లీ టూర్ అప్డేట్స్‌పై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా అని సమాచారం తెలుసుకుంటున్నారట. ఇలా రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతీసారి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న నేతల పరిస్థితి ఇలానే ఉంటోంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లడం, ఎమ్మెల్యేలు ఎదురుచూసి సల్లబడిపోవడం కామన్ అయిపోయింది.మంత్రివర్గ విస్తరణ వాయిదా పడుతూ వస్తున్నా..ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలు మాత్రం ఆపడం లేదన్న చర్చ జరుగుతోంది.

అనుకూలంగా ఉన్న వర్గాల ద్వారా ఢిల్లీ పెద్దలతో రాయబారం నడుపుతున్నారట. ఒకవైపు సీఎం రేవంత్ రెడ్డితో టచ్ లో ఉంటూనే మరోవైపు ఢిల్లీ పెద్దలను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. మంత్రివర్గంలో ఈ సారి ఎలాగైనా తమ పేరు ఉండాల్సిందేనని కొందరు సీనియర్లు పట్టుదలతో ఉన్నారట. అయితే ఈ మధ్య ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డికి.. దీపావళి తర్వాతే క్యాబినెట్ విస్తరణపై ఆలోచిస్తామని ఏఐసీసీ పెద్దలు సంకేతాలిచ్చినట్లు టాక్. ఈ విషయం తెలిసిన ఆశావాహులంతా నిరాశకు గురైనట్లు పార్టీవర్గాలు చర్చించుకుంటున్నాయి. అసలు మంత్రివర్గ విస్తరణ ఆలస్యం కావడానికి కారణాలు ఏమై ఉంటాయన్నది కాంగ్రెస్ నేతలెవ్వరికి అంతుపట్టడం లేదు. ఎందుకు కాంగ్రెస్ అధిష్టానం క్యాబినెట్ ఎక్స్‌పాన్షన్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం లేదని తలలు పట్టుకుంటున్నారట. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే అధిష్టానం పెద్దలతో పలు మార్లు సంప్రదింపులు జరిపినా ఎందుకు పెండింగ్‌లో పెట్టారని ఆవేదన చెందుతున్నారట. ఇక ఇప్పుడు దీపావళి పండగ తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న సమాచారంతో మళ్లీ యథావిధిగా ఎవరి స్థాయిలో వాళ్లు మంత్రివర్గంలో చోటు కోసం లాబీయింగ్ మొదలుపెట్టారన్న టాక్ వినిపిస్తోంది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటిపోయింది. డిసెంబర్ వస్తే ఏడాది అవుతుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయి మంత్రివర్గం ఏర్పాటవుతుందనే మాట వినిపించినా అది కార్యరూపం దాల్చలేదు. మూడు నెలలుగా మంత్రివర్గ విస్తరణపై ఎన్నో ఊహాగానాలు కొనసాగుతున్నాయి. శ్రావణ మాసం అయిపోయింది. దసరా కూడా గడిచిపోయింది. ఇక దీపావళికి అయినా అమాత్య ఆశలు నెరవేరుతాయా లేదా అన్నది డౌట్‌గానే ఉందన్న చర్చ జరుగుతోంది.



# ఎన్టీఆర్ తరహాలో పవన్



జయభేరి, విజయవాడ, అక్టోబరు 14:

జనసేన అధినేత పవన్ ప్రభావం దేశవ్యాప్తంగా ఉంది. ముఖ్యంగా సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చేవారికి ఆయన ఒక రోల్ మోడల్ గా కనిపిస్తున్నారు. అందుకే ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న సినీ నటులు పవన్ కళ్యాణ్ ను కలిసి రాజకీయ నిర్ణయాలు తీసుకుంటున్నారు. తాజాగా విలక్షణ నటుడు షియాజీ షిండే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. మహారాష్ట్రలోని నేషనల్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొద్ది రోజుల కిందట పవన్ కళ్యాణ్ ను షిండే కలిశారు. కీలక చర్చలు జరిపారు. పవన్ సనాతన ధర్మ పరిరక్షకు మద్దతు తెలిపారు. ఆలయాల్లో దేవుడి దర్శనం చేసుకునే భక్తులకు మొక్కలు ఇవ్వాలన్న ప్రతిపాదన పెట్టారు. మహారాష్ట్రలో తాను ఓ 3 ఆలయాల్లో అదేవిధంగా మొక్కలు అందించిన విషయాన్ని పవన్ కు తెలియజేశారు. దీనిపై పవన్ సానుకూలంగా స్పందించారు. పవన్ సనాతన ధర్మ పరిరక్షణ అంశాన్ని వ్యతిరేకించారు మరో నటుడు ప్రకాష్‌రాజ్. కానీ షిండే మాత్రం ఆహ్వానించారు. నిర్మాణాత్మకమైన సూచనలు చేశారు. అయితే పవన్ ను కలిసిన తర్వాత.. ఆయన నేషనల్ కాంగ్రెస్ పార్టీలోకి ఎంట్రీ ఇవ్వడం విశేషం. మహారాష్ట్రలో శివసేన ఎన్సిపి బిజెపి భాగస్వామ్య ప్రభుత్వం నడుస్తోంది. ఈ క్రమంలో బిజెపి భాగస్వామ్య పార్టీ అయినా ఎన్సీపీలో షిండే చేరడం వెనుక పవన్ ఉన్నారని ప్రచారం సాగుతోంది. అయితే పవన్ నందమూరి తారక రామారావును గుర్తు చేస్తున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. సినీరంగంలో ఉన్న ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేశారు. కేవలం 9 నెలల్లోనే ఉమ్మడి ఏపీలో అధికారంలోకి రాగలిగారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఏలుబడిలో ఉన్న ఏపీని తెలుగుదేశం పార్టీ హస్తగతం చేసుకుంది. దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీలకు దిక్సూచిగా మారింది. వ్యాప్తంగా ఉన్న అనేక చిత్ర పరిశ్రమలకు ఎన్టీఆర్ ఆదర్శంగా మారారు. తమ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చి సక్సెస్ సాధించిన ఎన్టీఆర్ ను అన్ని చిత్ర పరిశ్రమలు మనస్ఫూర్తిగా అభినందించాయి. ఎన్టీఆర్ ను స్ఫూర్తిగా తీసుకొని చాలామంది సినీనటులు రాజకీయాల్లోకి వచ్చారు. మరికొందరు రాజకీయ పార్టీలు స్థాపించారు. కానీ ఎన్టీఆర్ స్థాయిలో రాణించలేకపోయారు.తమిళనాడులో సైతం సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు రాజకీయాల్లో రాణించడం సర్వసాధారణం. అయితే ఏపీలో మాత్రం ఎన్టీఆర్ తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎంతోమంది నటులు రాజకీయాల్లోకి వచ్చి పదవులు చేపట్టారు. ప్రజాసేవ కోసం ముందుకు వచ్చే వారిని ప్రోత్సహించేవారు ఎన్టీఆర్. ఇప్పుడు అదే పరిస్థితి పవన్ లో కనిపిస్తోంది. ఎన్నికల్లో పోటీ చేసిన 21 అసెంబ్లీ సీట్లతో పాటు రెండు పార్లమెంట్ స్థానాల్లో జనసేన విజయం సాధించింది. శత శాతం విక్టరీతో అందరినీ ఆకర్షించగలిగారు. అందుకే దేశం యావత్తు చిత్ర పరిశ్రమలకు చెందిన వ్యక్తులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అటువంటి వారంతా పవన్ ను కలిసేందుకు ఇష్టపడుతున్నారు. అందులో భాగంగానే షియాజి షిండే పవన్ ను కలిసినట్లు వార్తలు వస్తున్నాయి. మొత్తానికి అయితే ఎన్టీఆర్ తరువాత దేశవ్యాప్తంగా ఆకర్షించడంలో పవన్ కళ్యాణ్ ముందంజలో ఉండడం విశేషం.




# లే రాజా.. లే లే రాజా


మెగా హీరో వరుణ్‌తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కరుణకుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ప్రచార కార్యక్రమాలు జోరందుకున్నాయి. అందులో భాగంగా 'లే లే రాజా..' అంటూ సాగే ఈ సినిమాలోని తొలి పాటను మేకర్స్ విడుదల చేశారు. రెట్రో అనుభూతిని కలిగించేలా భాస్కరభట్ల రాసిన ఈ పాటను 70, 80ల కాలం నాటి తీరులో జీవీ ప్రకాశ్‌కుమార్ స్వరపరిచారు. నీతి మోహన్ ఆలపించారు. ఈ పాటలో వరుణ్‌తేజ్ భిన్నమైన గెటప్పులతో ఆకట్టుకోగా, కలర్‌ఫుల్ పబ్ నేపథ్యంలో సాగిన ఈ పాటలో నోరా ఫతేహి రెట్రో లుక్‌లో అలరించారు. జానీ మాస్టర్ నృత్య రీతులు ఈ పాటకు హైలైట్‌గా నిలిచాయి. మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈచిత్రం నవంబర్ 14న గ్రాండ్‌గా విడుదల కానుంది. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్.





# శ్రీలీల పాత్రలో మమితా ?

తమిళ అగ్ర హీరో విజయ్ తన చివరి చిత్రాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఓ ఆసక్తికరమైన వార్త వినిపిస్తున్నది. బాలకృష్ణ 'భగవంత్ కేసరి' రీమేక్‌గా ఈ సినిమా రూపొందనున్నదని చెన్నై సమాచారం. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మమితా బైజు ప్రధాన భూమిక పోషిస్తున్నది. తెలుగులో శ్రీలీల చేసిన పాత్రనే తమిళంలో మమితా బైజు పోషిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వినిపిస్తున్న వార్తలు కూడా దానికి బలాన్నిస్తున్నాయి. బాలయ్య సినిమాలో శ్రీలీల తన నటనతో ఆకట్టుకున్నది. యాక్షన్ సీన్స్‌లోనూ అదరగొట్టేసింది. మరి మమితా ఆ స్థాయిలో ఆకట్టుకుంటుందా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరి విజయ్, పూజా, మమితా కాంబో ఆడియన్స్‌కి ఎలాంటి ట్రీట్ అందిస్తుందో చూడాలి.




# ఉపేంద్ర ఫాంటసీ

కన్నడ అగ్రనటుడు ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న ఫాంటసీ చిత్రం 'యూఐ'. జి.మనోహరన్, కె.పి.శ్రీకాంత్ నిర్మాతలు. డిసెంబర్ 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా రిలీజ్‌డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఉపేంద్ర పెద్ద గన్ పట్టుకుని డైనమిక్‌గా నిల్చున్న ఈ పోస్టర్ మాస్‌కి నచ్చేలా ఉంది. రీష్మా నానయ్య కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో నిధి సుబ్బయ్య, మురళీశర్మ, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: హెచ్‌సీ వేణుగోపాల్, సంగీతం: అజనీష్ బి.లోక్‌నాథ్.

# ప్రభాస్ బర్త్‌డే కానుక

ప్రభాస్ హీరోగా తెరంగేట్రం చేసిన చిత్రం 'ఈశ్వర్'. 22ఏండ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం మాస్ హీరోగా ప్రభాస్‌కి గొప్ప ప్రారంభాన్ని ఇచ్చింది. జయంత్ సి.పరాంజీ ప్రభాస్‌లోని మాస్ యాంగిల్‌ని తొలి సినిమాతోనే అద్భుతంగా ఆవిష్కరించారు. కె.అశోక్‌కుమార్ నిర్మాత. ఈ నెల 23న ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా 'ఈశ్వర్' చిత్రం గ్రాండ్‌గా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ మూవీ ట్రైలర్‌ని కొత్తగా కట్ చేసి రిలీజ్ చేశారు. 'రీ ఇంట్రడ్యూసింగ్ ప్రభాస్' అంటూ వదిలిన 'ఈశ్వర్' ట్రైలర్ ఇప్పుడు అందర్నీ ఆకట్టుకుంటున్నదని చిత్రాన్ని విడుదల చేస్తున్న లక్ష్మీ నరసింహా మూవీస్ వారు ఆనందం వెలిబుచ్చారు. ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా అభిమానులకు మేం ఇస్తున్న కానుక 'ఈశ్వర్' రీరిలీజ్ అని వారు అన్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com